క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పుష్పాలంకరణలో షిర్డీ సాయిబాబా విగ్రహం

తగరపువలస: స్థానిక మెయిన్ రోడ్డులోని శ్రీషిర్డీ సాయిబాబా ఆలయ 19వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు బాబా మూలవిరాట్ విగ్రహానికి పాలాభిషేకం, అర్చనలు, ఊయలసేవ, తిరువీధి ఉత్సవాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో 5 వేల మందికి అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కొప్పల కృష్ణ, ఉప్పల సాయిరాం, మాదాబత్తుల శ్రీరాములు, మాదాబత్తుల గురునాథ్, కొప్పల అప్పారావు, గుగ్గిళ్ల రాజేశ్వరరావు, రంగనాయకులు, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఇగ్నో ప్రవేశాలకు 28వ తేదీ తుది గడువు

ఎంవీపీకాలనీ : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 2023 జనవరి విద్యాసంవత్సరానికి ప్రవేశాల గడువు ఈ నెల 28తో ముగియనుంది. ఈ మేరకు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు వివరాలు వెల్లడించారు. ఇగ్నో ద్వారా అందిస్తున్న డిగ్రీ, పీజీ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరగనున్నాయి. కేంద్రం పరిధిలోని 5 జిల్లాల విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. https://ignouadmission.samarth.edu.in/ ద్వారా ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రవేశాల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కు పూర్తి ఫీజు రాయితీ కల్పిస్తున్నారు. పూర్తి వివరాలకు ఎంవీపీకాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించాలి.

27 నుంచి యోగా శిబిరం

ఏయూక్యాంపస్: ఆంధ్రా విశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి జనరల్ యోగా తరగతులను ప్రారంభిస్తున్నట్లు కేంద్రం విభాగాధిపతి కె.రమేష్‌బాబు తెలిపారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తరగతులు జరుగుతాయని, ఆసక్తి ఉన్న వారు 94944 01919, 93980 19922 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.


1 నుంచి స్థూలకాయ నివారణ శిబిరం

ఏయూ యోగా కేంద్ర ఆధ్వర్యంలో మార్చి 1 నుంచి స్థూలకాయ నివారణ ప్రత్యేక యోగా శిబిరాన్ని ప్రారంభిస్తున్నట్లు సంచాలకుడు ఆచార్య భానుకుమార్ తెలిపారు. వివరాలకు 83743 57324లో సంప్రదించాలని కోరారు.

రక్తదానంతో ప్రాణదానం

ఆనందపురం : రక్తదానం చేయడం వల్ల ప్రమాదంలో ఉన్న వారి ప్రాణాలు కాపాడవచ్చని విశ్వనాథ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ పి.ఉమాదేవి అన్నారు. మండలంలోని తర్లువాడలో ఉన్న కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ సుమారు 60 మంది విద్యార్థులు, అధ్యాపకులు స్వచ్ఛందంగా రక్తాన్ని దానం చేశారని తెలిపారు. లయన్స్ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు డాక్టర్ అజంతా బారువ, ఎన్వీఎన్ దుర్గా ప్రసాద్, ఎన్ఎస్ఎస్ పీవో జి.ఉమా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

తాతినాయుడుకు డాక్టరేట్



తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం శ్రీఅయ్యప్పస్వామి సేవాపీఠం ధర్మకర్త గాడు తాతినాయుడుకు శనివారం తమిళనాడు రాష్ట్రం హోసూర్‌లో ఆసియా వేదిక్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్శిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆధ్యాత్మిక, సామాజిక, సేవారంగంలో చేస్తున్న కృషికి డాక్టరేట్‌ను అందించారు. ఈ సందర్భంగా తాతినాయుడును అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచారసభ ఉపాధ్యక్షుడు పైల ఆదిమోహనరెడ్డి, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గాడు వెంకటప్పడు, భీమిలి వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు గాడు శ్రీను, సర్పంచ్ గాడు వెంకటనారాయణ, గుడ్డాల ఎల్లయ్య, కరుకుక్క అప్పలనారాయణ, వెంకటరమణ, నీలాపు సూర్యనారాయణ, కంటుబుక్త వెంకన్న, కనకల సన్యాసినాయుడు, మజ్జి వెంకటరావు, బమ్మిడి బంగారునాయుడు తదితరులు అభినందించారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌కు మురుగునీటి ముప్పు



హైవే డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్త



చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు నిలిచిన మురుగు నీరు

తగరపువలస: చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు నిలిచి ఉన్న మురుగునీటితో సిబ్బంది, వినియోగదారులకు తిప్పలు తప్పడం లేదు. వర్షాలు కురిసే సమయంలోనే కాకుండా ఎండలు కాసేటప్పుడు కూడా మురుగును దాటలేక అందులో నుంచే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. మూడేళ్లుగా సబ్‌స్టేషన్ ముందు సర్వీస్ రోడ్డుపై చెరువులా మురుగునీరు నిలిచి ఉన్నా.., హైవే ఇంజినీరింగ్ అధికారులకు పలుమార్లు వివిధ వర్గాల ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నా పరిష్కరించడం లేదు. భీమిలి జోన్ ఒకటో వార్డు బాలాజీనగర్ నుంచి రెండో వార్డు అల్లూరి సీతారామరాజు కాలనీ వరకు వాడుక నీరు ఈ డ్రైనేజీలోనే నిలిచి ప్రవాహానికి చెత్త, మట్టి తదితర పూడిక అడ్డం కారణంగా సర్వీస్‌రోడ్డుపై నిలిచిపోతోంది. సబ్‌స్టేషన్‌కు నిత్యం వచ్చే సిబ్బంది, వినియోగదారులే కాకుండా సర్వీస్ రోడ్డుపై ప్రయాణించే వారు సైతం మురుగు బెడద తప్పించుకోలేకపోతున్నారు. పెద్ద వాహనాలు వేగంగా వచ్చినప్పుడు ఈ నీరు పాదచారులు, ద్విచక్ర వాహనదారులపై తుళ్లుతుండడంతో దుస్తులు మురికిగా మారుతున్నాయని వాపోతున్నారు. సర్వీస్‌రోడ్డుపై నిలిచిన మురుగునీరు నాచుకట్టి పేరుకుపోయింది.

జీవీఎంసీ కమిషనర్ ఆదేశించినా ఫలితం శూన్యం

సర్వీస్‌రోడ్డుపై నిలిచిన నీటి ప్రవాహానికి తక్షణమే పరిష్కారం చూపాలని గతంలో మూడు సార్లు పర్యటించిన జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు ఆదేశించినా హైవే, ఇరిగేషన్, రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు పరిష్కారం చూపలేకపోయారు. ప్రస్తుతం డ్రైనేజీ పొడవునా చెత్త, మట్టి పేరుకుపోవడంతో శుభ్రం చేయాలని కోరుతున్నారు. పూడిక తొలగింపుతో సర్వీస్ రోడ్డుపై నిలిచిన నీరు డ్రైనేజీలోకి చేరుతుందన్న సామాన్య సూత్రాన్ని కూడా పై విభాగాల అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఆయా విభాగాల అధికారులు సమన్వయం చేసుకుని డ్రైనేజీల్లోని పూడిక తొలగించాలని విద్యుత్ వినియోగదారులు, సిబ్బంది, పాదచారులు కోరుతున్నారు.

సామరస్యానికి క్రీడలు దోహదం



ట్రోఫీలు ఆవిష్కరిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల తదితరులు

తగరపువలస: వివిధ ప్రాంతాల మధ్య సామరస్యానికి క్రీడలు దోహదపడతాయని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల అన్నారు. పోలమాంబ అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా సంగివలస పోలమాంబ యూత్ ఆధ్వర్యంలో ప్రారంభంకానున్న మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ఆమె ప్రారంభించి ట్రోఫీలు ఆవిష్కరించారు. నిర్వాహకులు మాట్లాడుతూ విన్నర్స్ జట్టుకు రూ.30 వేలు, రన్నర్స్ జట్టుకు రూ.20 వేలు నగదు బహుమతి అందజేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అక్కరమాని మంగరాజు, కృష్ణమూర్తి, జేఎస్ రెడ్డి, లోవరాజు, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

దివీస్ సహకారం విద్యార్థులకు వరం



ఆధునికీకరించిన తరగతి గదులను ప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

భీమునిపట్నం: దివీస్ సంస్థ అందించిన సహకారం విద్యార్థులకు వరం లాంటిదని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున అన్నారు. హుద్‌హుద్ సమయంలో దెబ్బతిన్న భీమిలి బీచ్‌రోడ్డులోని సమీకృత బాలికల వసతి గృహం గదులు, బాత్‌రూమ్‌లు, వంట గది, డైనింగ్ రూమ్‌ను దివీస్ సంస్థ రూ.59.17 లక్షలతో ఆధునికీకరించింది. ఆ వసతులను కలెక్టర్ మల్లకార్జున శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వపరంగా నాడు - నేడు పథకం కింద 800 పాఠశాలలు అభివృద్ధి చేశామన్నారు. ఇక్కడి వసతి గృహానికి అవసరమైన అన్ని పనులు చేపట్టడం ఎంతో గొప్ప విషయమని, అందుకు దివీస్ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నామన్నారు. వసతులను సద్వినియోగం చేసుకుని బాలికలు చక్కగా చదువుకోవాలని కోరారు. దివీస్ డైరెక్టర్ మధుసుదనరావు మాట్లాడుతూ మరికొన్ని వసతి గృహాల ఆధునికీకరణకు రూ.2.50 కోట్లు కేటాయించామని, పనులు జరుగుతున్నాయని తెలిపారు. విద్యార్థుల చదువు, వసతుల కోసం పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీవో ఎస్.భాస్కరరెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి కె.శ్రీదేవి, భీమిలి సహాయ సంక్షేమ శాఖ అధికారి జె.జ్యోతిశ్రీ,, తహసీల్దార్ కె.వేణుగోపాల్, ఎంపీడీవో వెంకటరమణ, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, దివీస్ ప్రతినిధులు ఈ.ఎస్.నాగరాజు, డి.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి



వరహాలరాజుని సత్కరిస్తున్న నాయకులు

ఆనందపురం : మండలంలోని రామవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కాకర్లపూడి వరహాలరాజుని శనివారం పలువురు నాయకులు సన్మానించారు. ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవిరెడ్డి ఇటీవల వరహాలరాజుని ఐఎన్‌టీయూసీ జాతీయ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు ఎంపీటీసీ సభ్యుడు గొలగాని కృష్ణ ఆధ్వర్యంలో వరహాలరాజుని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి కార్మికుల శ్రేయస్సుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గొలగాని పైడిరాజు, అక్కడిరెడ్డి దేముడుబాబు, గుడ్ల రమణ, చందక నరసింగరావు, యర్ర అచ్చిబాబు, కె.ముత్యాలరావు, కె.దేముడు, డి.పైడిరాజు, ఎం.రమణ పాల్గొన్నారు.

వాహనాల వేలం నేడు

భీమునిపట్నం: భీమిలిలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) స్టేషన్ పరిధిలో పట్టుబడిన వాహనాలను ఆదివారం సాయంత్రం వేలం వేయనున్నట్లు సీఐ వి.రామకృష్ణ తెలిపారు. ఎనిమిది ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలు, ఒక కారు ఉందని... ఆసక్తి గల వారు ముందుగా ధరావతు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

కమ్మలపాక హోటల్ దగ్ధం

భీమునిపట్నం: భీమిలి యోగా కేంద్రం సమీపంలోని కమ్మలపాకలో నిర్వహిస్తున్న హోటల్ శుక్రవారం అర్ధరాత్రి దగ్ధమైంది. ఇక్కడ మొకర ఆదినారాయణ అనే వ్యక్తి టిఫిన్ హోటల్ నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి అకస్మాత్తుగా మంటలు చెలరేగి హోటల్, అందులోని సామగ్రి మొత్తం కాలిపోయాయి. సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లింది. గుర్తు తెలియని వ్యక్తులు కాల్చేసి వుంటారని నిర్వాహకుడు ఆదినారాయణ అనుమానం వ్యక్తం చేస్తున్నాడు. అధికారులు న్యాయం చేయలని కోరుతున్నాడు.

బోటు షికారు పరిశీలన

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతంలో నిర్వహిస్తున్న బోటు షికారు నిర్వహణ, బోట్ల పనితీరు, సాంకేతిక లోపాలు వంటి అంశాలను శనివారం కాకినాడ పోర్టు నుంచి ఏపీ మారిటైమ్ సర్వేయర్ సుధీర్ పరిశీలించారు. ఏపీ టూరిజం, ప్రైవేటు ఆపరేటర్లు నిర్వహిస్తున్న బోట్ల పనితీరును, అదేవిధంగా బోటు డ్రైవర్ల సర్టిఫికెట్లను పరిశీలించారు.

బీచ్‌లో వ్యర్థాల తొలగింపు



సేకరించిన వ్యర్థాలతో వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన రుషికొండ బీచ్‌లో శనివారం ఎండాడకు చెందిన అథ్లెటిక్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు స్వచ్ఛ భారత్ నిర్వహించారు. తీరం వెంట ఉన్న ప్లాస్టిక్ సంచులు, ఇతర వ్యర్థాలు తొలగించారు. అదేవిధంగా ఇక్కడకు వచ్చిన పర్యాటకులకు ప్లాస్టిక్ వాడకంతో అనర్థాలను తెలియజేస్తూ అసోసియేషన్ సభ్యుడు వైకుంఠరావు అవగాహన కలిగించారు. అసోసియేషన్ సెక్రటరీ రాజేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఎన్‌డీఆర్ఎఫ్ మాక్ డ్రిల్



మాక్ డ్రిల్‌లో అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది

మధురవాడ: భూకంపాలు, వరదలు ఇతర ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సురక్షితంగా ఎలా బయటపడాలన్న అంశాలపై ఎన్‌డీఆర్ఎఫ్ నిర్వహించిన మాక్ డ్రిల్ విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. జీవీఎంసీ 7వ వార్డు వాంబేకాలనీ సునీల్‌శర్మ కాలనీలో గల జెడ్పీ ఉన్నత పాఠశాల శనివారం దీనికి వేదికైంది. ముఖ్యంగా వరదలు వచ్చినప్పుడు తమని తాము ఏవిధంగా రక్షించుకోవాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. గుండెపోటు వచ్చినప్పుడు ప్రథమి చికిత్స చేసే విధానం వివరించారు. అనంతరం పాఠశాలకు అవసరమైన మెడికల్ కిట్ అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎమ్ ఉమా మహేశ్వరి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్వరగా జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరామ్మూర్తి

పద్మనాభం: త్వరితగతిన జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామూర్తి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసంపూర్తిగా ఉన్న జగనన్న కాలనీ ఇళ్లను ఉగాదిలోగా పూర్తి చేయాలన్నారు. ఇందుకు తక్షణమే యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలని సూచించారు. సమావేశంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవో పి.రాధ, ఈవోఆర్డీ ఎం.ఉషారాణి, గృహ నిర్మాణ శాఖ డీఈ విజయలక్ష్మి, ఏఈ పద్మజ పాల్గొన్నారు.

రైతు విభాగం జిల్లా అధ్యక్షుడికి సన్మానం



అప్పలనాయుడిని సన్మానిస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: రైతు విభాగం జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన కృష్ణాపురం గ్రామానికి చెందిన మొకర అప్పలనాయుడును పద్మనాభంలోని వైఎస్సార్ సీపీ మండల కార్యాలయంలో వైఎస్సార్ సీపీ తరఫున ఎంపీపీ కంటుబోతు రాంబాబు శనివారం సన్మానించారు. అప్పలనాయుడుకు స్వీటు తినిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రాంబాబు మాట్లాడుతూ పద్మనాభం మండలానికి చెందిన వ్యక్తికి రైతు విభాగం జిల్లా అధ్యక్ష పదవి దక్కడం అభినందనీయమన్నారు. రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మొకర అప్పలనాయుడు మాట్లాడుతూ తనకు ఈ పదవి ఇప్పించిన భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కోన రమణ, తాలాడ పద్మనాభం, సీర సూరప్పడు, దున్న అబ్రహం, తాలాడ నరిసింహనాయుడు తదితరులు పాల్గొన్నారు.

హిందీ ఉపాధ్యాయుల శిక్షణకు ప్రసాదరావు



ప్రసాదరావుకు సర్టిఫికెట్ అందిస్తున్న పంకజ్ ద్వివేది

తగరపువలస: మైసూర్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్(సీఐఐఎల్) ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహించిన దక్షిణ భారత రాష్ట్రాల్లోని హిందీ ఉపాధ్యాయుల శిక్షణ తరగతులకు భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు టి.ఎస్.వి.ప్రసాదరావు హాజరయ్యారు. పరీక్షలు, మూల్యాంకనం, రైటింగ్ అంశాలతోపాటు ప్రస్తుతం అమలులో ఉన్న పరీక్షల ఫార్మేట్, సీబీఐ, సమ్మేటివ్, అసెస్‌మెంట్‌లపై విస్తృతంగా చర్చించారు. ఈ శిక్షణ కార్యక్రమం రాష్ట్రంలో జరుగుతున్న హిందీ పరీక్షా ప్రశ్నాపత్రాల తయారీకి ఉపయోగపడుతుందని ప్రసాదరావు తెలిపారు. రాష్ట్రం నుంచి ఇద్దరు హిందీ ఉపాధ్యాయులు హాజరు కాగా జిల్లా నుంచి తానొక్కడినే అన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న ప్రసాదరావుకు సీఐఐఎల్ అసిస్టెంట్ డైరెక్టర్ పకంజ్ ద్వివేది సర్టిఫికెట్ అందించారు.

సీఎం జగన్ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు



చీరలు పంపిణీ చేస్తున్న అనూష, ప్రశాంతి

తగరపువలస: కోవిడ్ సమయంలోనూ రాష్ట్ర ప్రజలను సేవా కార్యక్రమాలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకున్నారని రాష్ట్ర శిష్టకరణాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ కంఠిమహంతి అనూష అన్నారు. అలాంటి సేవా భావంతో దూసుకుపోతున్న శిష్టకరణాల రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు డబ్బీరు ప్రశాంతి పట్నాయిక్‌ను మిగిలినవారు ఆదర్శంగా తీసుకోవాలని ఆమె సూచించారు. శనివారం ప్రశాంతి పుట్టినరోజు సందర్భంగా వంద మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎస్.ఎమ్.కె మహంతి, అరికతోట చంద్రమౌళి, బీవీఎస్ పాత్రో, శివప్రసాద్, హరనాథ్, శంకరరావు, వైఎస్సార్‌సీపీ 2వ వార్డు ఇన్‌ఛార్జి శిల్లా సరళారాణి, అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, ప్రధానకార్యదర్శి చిప్పాడ వెంకటేష్, ఎస్.కరుణాకరరెడ్డి, చిల్ల ప్రమీల, కంచుబోయిన వెంకటరావు, సరగడ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపుపై మీనమేషాలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సంతపేట గొల్లవీధిలో డ్రైనేజీలపై ఆక్రమణల తొలగింపు విషయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. 'డ్రైనేజీలపై ఇష్టారాజ్యంగా నిర్మాణాలు' శీర్షికతో ఈ నెల 9న సాక్షిలో ప్రచురించిన వార్తకు మరుసటి రోజు వచ్చిన అధికారులు యంత్రాలు లేవని తర్వాత తొలగిస్తామని వెళ్లిపోయారు.

అనంతరం ఆక్రమణల తొలగింపును మరచిపోవడంతో స్థానికులు పదేపదే గుర్తు చేయగా జేసీబీ సాయంతో శనివారం వచ్చారు. డ్రైనేజీలపై ఆక్రమణలు ఉన్నచోట కాకుండా వేరేచోట తొలగింపునకు ఉపక్రమించారు. దీంతో టౌన్‌ప్లానింగ్ సిబ్బందిని స్థానికులు నిలదీయగా ఎవరో ఒక్కరి బలవంతాన తాము తొలగింపులకు వచ్చామని చిచ్చుపెట్టే ప్రయత్నం చేశారు. దీంతో స్థానికులు వారిని నిలదీస్తూ పారిశుధ్య పనులకు ఇబ్బందిగా ఉన్నచోట ఆక్రమణలు తొలగిస్తారా..? లేదా ఎవరో ఒకరి ప్రోద్బలంతో తొలగిస్తారా అంటూ నిలదీశారు. దీంతో కంటి తుడుపు చర్యగా ఫిర్యాదు లేనిచోట పాక్షికంగా తొలగించి వెళ్లిపోయారు. వాస్తవంగా ఆక్రమణలు ఉన్నచోట తొలగించడానికి మాత్రం టౌన్ ప్లానింగ్ సిబ్బంది ముందుకు రావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కిడ్నీ వ్యాధి బాధితునికి రూ.5 వేల సాయం



బాధితుని భార్యకు రూ.5 వేలు అందిస్తున్న శ్రీనివాసరెడ్డి

తగరపువలస: పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీ సామియ్యవలసకు చెందిన కిడ్నీ వ్యాధి బాధితుడు గంధవరపు సత్తిబాబు చికిత్స కోసం శనివారం వుయ్ కేర్ యూ సొసైటీ, హెల్పింగ్ హేండ్స్ ద్వారా వెంపాడ శ్రీనివాసరెడ్డి రూ.5 వేలు అందించారు. ఇటీవల బాధితునికి కిడ్నీ ఆపరేషన్ ఫెయిల్ కావడంతో మరోమారు శస్త్రచికిత్స చేయాల్సి రావడంతో ఈ సాయం అందించారు. ప్రస్తుతం బాధితుడు కేజీహెచ్‌లో ఉండగా అతని భార్యకు నగదు అందించారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు

మధురవాడ: సచివాలయానికి వచ్చిన ఫైల్స్ క్రమ పద్ధతిలో అప్‌లోడ్ చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం తగదని జీవీఎంసీ మధురవాడ జోన్ - 2 కమిషనర్ కొట్యాడ కనక మహాలక్ష్మి సూచించారు. తన చాంబర్‌లో సచివాలయ అడ్మిన్లతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అన్ని పత్రాలు ఉంటేనే ఇంటి పన్ను, వీఎల్‌టీ తీసుకుని అప్‌లోడ్ చేయాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సహించేది లేదని హెచ్చరించారు. రెవెన్యూ వసూళ్లు, ఇతర అంశాలపై సమీక్ష నిర్వహించి సూచనలు చేశారు.

హెచ్చరిక బోర్డు ఉండగానే గెడ్డ పూడ్చివేత



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన గెడ్డ ఇదే

మధురవాడ: విశాఖ రూరల్ మండలం పరదేశిపాలెం రెవెన్యూ గ్రామం మారికవలసలో ప్రభుత్వ హెచ్చరిక బోర్డు ఉన్న చోటే కొందరు వ్యక్తులు గెడ్డ పూడ్చివేతకు ప్రయత్నాలు చేస్తున్నారు. శనివారం ఇక్కడ జేసీబీతో గెడ్డ పూడ్చివేత పనులు ప్రారంభించగా స్థానిక నాయకుల ఫిర్యాదు మేరకు సచివాలయ సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకుని పనులు నిలుపుదల చేయించారు. హైవేకి అత్యంత చేరువలో మారికవలస శివాలయానికి వెళ్లే బీటీ రోడ్డులో సుమారు 200 గజాల విస్తీర్ణంలో ఈ గెడ్డ ఉంది. అయితే గతంలో ఇక్కడ పనులు చేసేందుకు ప్రయత్నాలు చేయగా రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఆ బోర్డు ఉన్నప్పటికీ గెడ్డను చాలా వరకు పూడ్చివేసి పక్కకు చిన్న కాల్వ ఏర్పాటు చేసి నీరు మళ్లించడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రెండో అంతస్తు నుంచి పడి వ్యక్తి మృతి



నరేష్ (ఫైల్)

పీఎం పాలెం: ప్రమాదవశాత్తు రెండో అంతస్తు నుంచి కిందకు పడిపోయిన వ్యక్తి మరణించాడు. ఇందుకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దారపురెడ్డి నరేష్ (39) జీవీఎంసీ 7వ వార్డు పరిధి వుడా రోడ్డులోని మిథిలాపురి కాలనీలో కుటుంబంతో నివసిస్తున్నాడు. అతను ఇటీవలే ఇండియన్ ఆర్మీలో రిటైర్‌మెంట్ తీసుకున్నాడు. ఈ క్రమంలో ఉద్యోగ ప్రయాత్నాలు చేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో రెండో అంతస్తు నుంచి కిందకు పడిపోయాడు. ఆ సమయంలో పెద్ద శబ్దం రావడంతో అతని భార్య ఆశాజ్యోతి, స్థానికులు తీవ్ర గాయాలతో ఉన్న నరేష్‌ను గాయత్రి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం నగరంలోని ప్రముఖ ఆస్పత్రికి తరలించగా అక్కడ శనివారం మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

యాజమాన్యం కవ్వింపు చర్యలు మానుకోవాలి

తగరపువలస: చిట్టివలస జ్యూట్ యాజమాన్యం కార్మికుల పట్ల కవ్వింపు చర్యలు మానుకోవాలని మెకానికల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఆర్ఎస్ఎన్ మూర్తి అన్నారు. శనివారం చిట్టివలస సిటు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నష్టపరిహారం విషయంపై తాము యాజమాన్యంపై వేసిన కేసు హైకోర్టులో పెండింగ్‌లో ఉందన్నారు. కానీ యాజమాన్యం ఇటీవల కార్మికులకు బకాయిలు చెల్లించినట్లుగా తప్పుడు ప్రచారం చేస్తుందన్నారు. కార్మికశాఖకు తప్పుడు సమాచారం ఇస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ సాడి సూరిబాబు, ఉపాధ్యక్షుడు ఎస్.అప్పలనాయుడు, బాబాజీ, కర్రి రాము, పూసల వెంకటరావు, అప్పలరాజు, చంటి, గుజ్జు రమణ తదితరులు పాల్గొన్నారు.

మాల్‌లో షార్ట్ సర్క్యూట్

మధురవాడ: మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ మాస్టర్ ప్లాన్ రోడ్డులో ఉన్న రిలయన్స్‌లో మాల్‌లో శనివారం ఉదయం షార్ట్ సర్క్యూట్ సంభవించింది. ఇక్కడ ప్రారంభానికి సిద్ధమవుతున్న మాల్‌లో శనివారం విద్యుత్ ప్యానల్ బోర్డు నుంచి పొగ వ్యాపించింది. దీంతో సూర్యబాగ్ అగ్నిమాపక కేంద్రానికి సిబ్బంది సమాచారం ఇవ్వడంతో వారు సకాలంలో స్పందించి సంఘటనా స్థలికి చేరుకున్నారు. గ్యాస్ ఉపయోగించి మంటలు అదుపు చేశారు. ఆస్తినష్టం జరగలేదని మాల్ నిర్వాహకులు చెప్పారు.

యువత నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు

మధురవాడ: యువత నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని జీవీఎంసీ మధురవాడ జోన్ - 2 కమిషనర్ కొట్యాడ కనక మహాలక్ష్మి చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పనలో భాగంగా యువతులకు శిక్షణ ఇచ్చి, ఆస్పత్రుల్లో జనరల్ డ్యూటీ అసిస్టెంట్‌గా ఉపాధి కల్పిస్తారన్నారు. ఈ మేరకు శనివారం మధురవాడ జోనల్ కార్యాలయంలో సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, సుగుణ తదితరులు శిక్షణ, ఉపాధి తదితర విషయాలు వివరించారు.

ఆరిలోవ పైనాపిల్ కాలనీలో గల మహిళా ప్రాంగణంలోని స్కిల్ హబ్‌లో నిరుద్యోగ యువతులకు శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. 18 నుంచి 30 ఏళ్ల వయసు కలిగి, 10వ తరగతి పాసైన మహిళలు అర్హులని చెప్పారు. 30 మందితో మొదటి బ్యాచ్ బుధవారం నుంచి ప్రారంభమవుతుందని, 6 నెలలు శిక్షణ కాలం ఉంటుందని చెప్పారు. ఈ అవకాశాన్ని ఆసక్తి కలిగిన మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 98856 94676, 85238 74274లో సంప్రదించాలని సూచించారు.